విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :121 నల్గొండ | బుధవారం 30-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 వెల : రూ.1/-


## రాజా సింగ్.. రా అంటే వెంటనే పార్టీలోకి వెళ్లిపోతా!



హైదరాబాద్,గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను బీజేపీ ఎమ్మెల్యే అని చెప్పొచ్చని, గోషామహల్‌కు మూడేళ్లు తానే ఎమ్మెల్యే అని పేర్కొన్నారు.కొన్ని తాను తప్పులు చేశానని, సోషల్ మీడియా మరికొన్ని తప్పుడు ప్రచారం చేసిందన్నారు. తమ పార్టీలో మిత్రులు, శత్రువులు ఉంటారని చెప్పారు. మీడియాకు రాజా సింగ్ లీక్‌లు ఇస్తున్నారని మా వాళ్లే కొందరు డిల్లీకి పిర్యాదు చేశారని తెలిపారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదన్నారు. బీజేపీ పార్టీకి మాత్రమే రాజీనామా చేశాను అని, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదని స్పష్టం చేశారు. బీజేపీ తన ఇల్లు అని, రాజా సింగ్ రా అంటే వెంటనే పార్టీలోకి వెళ్లిపోతాను అని రాజా సింగ్ చెప్పారు.'నన్ను బీజేపీ ఎమ్మెల్యే అని చెప్పొచ్చు. కొన్ని నా తప్పులు జరిగాయి, సోషల్ మీడియా మరికొన్ని తప్పు ప్రచారం చేసింది. అమిత్ షా , ప్రధాని మోడీ ఫోన్ చేశారని తప్పుడు ప్రచారం చేశారు. పార్టీలో మిత్రులు, శత్రువులు ఉంటారు. మీడియాకు రాజా సింగ్ లీక్ ఇస్తున్నారని మా వాళ్లే కొందరు ఢిల్లీకి పిర్యాదు చేశారు. పెన్ డ్రైవ్‌లో నా మీద ఫిర్యాదులు పంపించారు. పిర్యాదులు, సోషల్ మీడియా వార్తలతోనా రాజీనామాను పెద్దలు ఆమోదించారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదు. నేను పార్టీకి రాజీనామా చేశాను, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఉప ఎన్నిక జరగకుండా ఇక్కడ ఎలా జరుగుతుంది. ఉప ఎన్నిక వస్తుందని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పాత బట్టలు ఐరన్ చేసుకొని తిరుగుతున్నారు. కొందరు మా పార్టీ వాళ్లు కూడా తిరుగుతున్నారు. మూడేళ్లు ఎమ్మెల్యేను నేనే. మా పెద్దవాళ్లు పిలిస్తే ఢిల్లీ వెళ్లి మాట్లాడుతాను. అన్ని విషయాలు పార్టీకి చెబుతాను. చాలా మంది పార్టీనీ ఎందుకు విడిచి వెళ్లరు, ఇతర పార్టీల నుండి వచ్చిన వారు అవమానాలు ఎందుకు భరిస్తున్నారు.. ఇవన్నీ చెబుతాను. ఇవాళ లేకపోతే రేపు అయినా పిలుస్తారు అని అనుకుంటున్నా' అని ఎమ్మెల్యే రాజా సింగ్ తెలిపారు.'నేను బీజేపీ హై కమాండ్‌ను కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నాను. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మా అధిష్ఠానం పిలుస్తుందనే నమ్మకం ఉంది. వేరే పార్టీలో ఉండలేను, ఆ పార్టీలకి నేను మ్యాచ్ కాను. బీజేపీ నా ఇల్లు, రాజా సింగ్ రా అంటే వెంటనే పార్టీ లోకి వెళ్లిపోతాను. నా వెనుక ఎవరు లేరు. గతం లో 14 నెలలు బీజేపీ నుండి సస్పెండ్ అయ్యాను. నా శత్రువులు పార్టీలో ఉన్నారు, ఇతర పార్టీలో కూడా ఉన్నారు. నేను ఏ పార్టీలోకి వెళ్లినా ఆ పార్టీకి నష్టమే. టీడీపీ, శివసేన, జనసేన ఈ మూడు పార్టీలు మా అలియన్స్ పార్టీలే. ధర్మ ప్రచారం, నియోజకవర్గం ప్రజలే ఈ రెండే నా ముందున్న అంశాలు. నా లాంటి వాళ్ళు వస్తారు పోతారు, బీజేపీ ఉండాలి. తెలంగాణలో ఉన్న వారికి ఇవాళ కాకున్న రేపు అయినా బుద్ధి వస్తుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది' అని ఎమ్మెల్యే రాజా సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

## రెడ్‌బుక్ తరహాలో వైసీపీ యాప్..



అమరావతి, ఏపీ రాజకీయాల్లో రెడ్‌బుక్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేశ్ తీసుకొచ్చిన ఈ రెడ్‌బుక్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంచలనంగా మారింది. రాష్ట్రంలో వైసీపీ నాయకులపై ఏ కేసు పెట్టినా అది రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే నడుస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వైసీపీ కూడా రెడ్‌బుక్‌కు అడ్వాన్స్‌డ్‌గా డిజిటల్ ఉద్యమానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం, కూటమి నాయకుల అండ కారణంగా ఏ అన్యాయం జరిగినా నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేసేందుకు ఒక యాప్ తెచ్చేందుకు సిద్ధమైంది. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యులతో మంగళవారం నాడు సమావేశమైన వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ జగన్.. ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. త్వరలోనే ఒక యాప్ తీసుకొస్తున్నామని.. ప్రభుత్వ వేధింపులు, అన్యాయం జరిగితే వెంటనే ఆ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఏపీలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని.. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నారు. ఇదే సంప్రదాయం కొనసాగితే టీడీపీలో అందరూ జైలుకెళ్లాల్సిందేనని హెచ్చరించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యులతో మంగళవారం నాడు జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మిథున్ రెడ్డి అరెస్టు బాధాకరమని అన్నారు. తమ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులపై ఫిర్యాదుల కోసం పార్టీ తరఫున త్వరలోనే యాప్ విడుదల చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా వెంటనే యాప్‌లో నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.ఫలానా వ్యక్తి, ఫలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని ఆ యాప్‌లో ఫిర్యాదు చేసి, ఆధారాలు అప్‌లోడ్ చేస్తే సరిపోతుందని జగన్ తెలిపారు. ఆ ఫిర్యాదులన్నీ ఆటోమేటిగ్గా తమ డిజిటల్ సర్వర్లలోకి వచ్చేస్తుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. అన్యాయానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులకు సంబంధించిన వీడియోలు, పత్రాలు పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జగన్ స్పష్టం చేశారు. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయమని అన్నారు. చంద్రబాబు ఏదైతే విత్తారో అదే చెట్టవుతుందని చెప్పారు.పార్టీ నిర్మాణ కార్యక్రమంలో పీఏసీ సభ్యులంతా భాగస్వాములు కావాలని వైఎస్ జగన్ కోరారు. పీఏసీ సభ్యులంతా క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రతి కార్యక్రమంలో పాలు పంచుకోవాలని సూచించారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందుకోసం అందరూ ఐకమత్యంగా పనిచేయాలని తెలిపారు. అంతర్గతంగా ఉన్న చిన్న విభేదాలను రూపుమాపి అందర్నీ ఒక్క తాటిపైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## హొంమంత్రి అమిత్ షా వైఫల్యంవల్లే పహల్గాం ఉగ్రదాడి



న్యూఢిల్లీ, కేంద్ర హొంమంత్రి అమిత్‌షా పై కాంగ్రెస్ ఎంఏ గౌరవ్ గొగోయ్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. పహల్గాం ఉగ్రదాడి పై మంగళవారం లోక్‌సభలో గంటన్నరపాటు మాట్లాడిన హొంమంత్రి.. తన హొంశాఖ వైఫల్యం గురించిగానీ, దాడి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తున్నాననిగానీ ఒక్క మాట కూడా మాట్లడకపోవడం దురదృష్టకరమని అన్నారు.%జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా ధైర్యంగా నిజం ఒప్పుకున్నారని గౌరవ్ గొగోయ్ పొగిడారు. భద్రతా వైఫల్యంవల్లే పహల్గాంలో ఉగ్రవాదుల దాడి జరిగిందని మనోజ్ సిన్హా పశ్చాత్తాపం వ్యక్తం చేశారని గొగోయ్ చెప్పారు. పండిట్ నెహ్రూ కారణంగానో, యూపీఏ కారణంగానో, రాహుల్‌గాంధీ కారణంగానో, రాజీవ్‌గాంధీ కారణంగానో పహల్గాం ఉగ్రదాడి జరగలేదని, ఆ దాడి కచ్చితంగా కేంద్ర హొంమంత్రి అమిత్ షా వైఫల్యం వల్లే జరిగిందని గొగోయ్ ఆరోపించారు.

## కాంగ్రెస్ సర్కారుపై ప్రజాతిరుగుబాటు మొదలైంది...



మహబూబాబాద్ : మోసకారి కాంగ్రెస్ సర్కారుపై ప్రజాతిరుగుబాటు మొదలైంది. గ్యారెంటీల గారడీపైజనగర్జన షురూ అయిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కురవి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొత్త డ్రామాకు తెరలేపి, హామీలు ఎలాగైతే ఎగ్గొట్టారో ఇపుడు బీసీ రిజర్వేషన్లను కాలయాపన చేసి ఎగ్గొట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు ఒకసారి జీవో అని, మరోసారి బిల్లు అని, ఆర్డినెన్స్ అని కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినట్టు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు.బీసీలు బాగుపడడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు కావొచ్చన్నారు. కాలయాపన చేస్తే సహించమన్నారు. గురుకుల పాఠశాల పిల్లలు చదువులో, క్రీడల్లో గొప్ప ప్రతిభను కలిగి ఉన్నారు. కానీ వారికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నుండి కావాల్సినంత సహకారం అందడం లేదన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా...



న్యూఢిల్లీ,జూలై29: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్ఐఏకు అప్పగించామని వివరించారు.ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు.ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు. పాక్‌లో వందల కిలో మీటర్ల లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భద్రతా దళాల దాడుల్లో పలువురు ఉగ్రవాద నేతలు కూడా హతమయ్యారని వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని, పాకిస్థాన్ దాడుల్లో ఇక్కడి గురుద్వారా, దేవాలయం ధ్వంసమయ్యాయని హోంశాఖ మంత్రి తెలియజేశారు.

## కాశ్మీర్‌లో శాంతి ఉందని మోడీ చెప్పారు.. ఎక్కడుందన్న ప్రియాంకాగాంధీ



న్యూఢిల్లీ,కాశ్మీర్‌లో శాంతి నెలకొంది.. భూములు కొనుక్కోవాలని మోడీ చెప్పారని.. ఎక్కడుందని వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు.ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా ప్రియాంకా గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. అధికారపక్ష నేతలు వివిధ అంశాలపై మాట్లాడారని.. కానీ పహల్గామ్ ఉగ్రదాడి ఎందుకు, ఎలా జరిగిందో మాత్రం చెప్పలేదని విమర్శలు గుప్పించారు.ఉగ్రవాదుల్ని తుది ముట్టించామని అమిత్ షా చెబుతున్నారని.. అసలు పహల్గామ్ ఉగ్ర దాడి నిఘా వైఫల్యం కాదా? అని నిలదీశారు. పహల్గామ్‌లో భద్రతా సిబ్బందిని ఎందుకు లేరని ప్రశ్నించారు. టీఆర్ఎఫ్ అనేది కొత్తగా రాలేదని కాశ్మీర్‌లో చాలా చోట్ల ఆ ఉగ్ర సంస్థ దాడి చేసిందన్నారు. 2024లో టీఆర్ఎఫ్ దాడుల్లో 9 మంది చనిపోయారని తెలిపారు. అయినా ఉగ్ర సంస్థ వరుస దాడులు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తోంది? అని అడిగారు. పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు బాధ్యత ఎవరిది?, హొంమంత్రి లేదా ఐబీ చీఫ్ ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రియాంక గాంధీ నిలదీశారు.ఆపరేషన్ సిందూర్‌పై రెండోరోజు లోక్‌సభలో చర్చ కొనసాగింది. అమిత్ షా మాట్లాడుతూ.. విపక్షాల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ వల్లే భారత్‌కు ఈ పరిస్థితి వచ్చిందంటూ దుమ్మెత్తిపోశారు. నెహ్రూ విధానాలు దేశాన్ని వెంటాడుతున్నాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇక మహాదేవ్ ఆపరేషన్‌లో పహల్గామ్ ఉగ్రవాదులు హతమయ్యారని అమిత్ షా తెలిపారు.ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం భారత ప్రభుత్వం.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.

## పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం...



న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్దాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలను కుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదో ఒక రోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు.కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని,కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసి ందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రా జ్‌నాథ్ పేర్కొన్నారు.మరో వైపు లోక్‌సభలో హొంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్,ఆపరేషన్ మహదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## సంపాదకీయం

**బుధవారం 30-07-2025**

# ఉప రాష్ట్రపతి : అపశ్రుతి, ఉపశ్రుతి

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి త్వరగా ఎన్నికలు జరపటానికి ఎన్నికల సంఘం రాజ్యసభ కార్యదర్శిని బాధ్యునిగా నియమించింది. రాజ్యాంగం లోని 63వ అధికరణం ఉప రాష్ట్రపతి గురించి, 68వ అధికరణం ఆ ఎన్నిక గురించి చెబుతున్నాయి. అయితే రాష్ట్రపతి విషయంలో ఆరు మాసాల్లోగా ఎన్నికలు పూర్తి చేయాలని చెబుతున్న రాజ్యాంగం ఉప రాష్ట్రపతి విషయంలో సాధ్యమైనంత త్వరగా (ఎ.ఎస్.ఎ.పి) అని మాత్రమే చెబుతోంది. జులై 21వ తేదీ రాత్రి అనూహ్యంగా రాష్ట్రపతి భవన్‌కి వెళ్లి రాజీనామా సమర్పించిన ధన్‌ఖడ్ అంతే వేగంగా నిష్క్రమించారు. తన రాజీనామాపై ఎవరైనా సంప్రదిస్తారని ఆయన వేసుకున్న అంచనాలు కూడా ఫలించలేదని చెప్తారు. మీరు ఆరోగ్యంగా ఉండాలని కోరుతున్నానని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు తప్ప దానిపై విచారం కనిపించలేదు. ఆఖరుకు రాజ్యసభలో లాంఛనంగా వీడ్కోలు కూడా లేదు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ వీడ్కోలు ప్రతిపాదించినా, విందు ఇవ్వాలని చెప్పినా కేంద్రం స్పందించలేదు. తాము విందు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ చేసిన ప్రతిపాదనకు సహజంగానే ధన్‌ఖడ్ స్పందించలేదు. వీటన్నిటిని బట్టి ఆయన ఇబ్బందికర పరిస్థితుల్లోనే విభేదాలతోనే హఠాత్తుగా నిష్క్రమించారని, అయినా అధికార పక్షానికి ఇబ్బంది కలిగించే పనులేవీ చేయదలుచుకోలేదని స్పష్టమవుతుంది. తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులపై వాస్తవాలు ఏంటో చెప్పడానికి ఆయన సిద్ధం కాలేదు. గతంలో జనతాదళ్ తరపున రాజస్థాన్ శాసనసభకు ఎన్నికై కాంగ్రెస్‌లో కూడా పని చేసి బిజెపి లోకి మారిన ధన్‌ఖడ్ బెంగాల్ గవర్నర్‌గా ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ముఖాముఖి తలపడ్డమే కాక ప్రత్యక్ష దాడికి కూడా దిగారు. 2022లో ఉప రాష్ట్రపతి అయ్యాక రాజ్యసభ ఛైర్మన్‌గా ప్రతి కీలక సందర్భంలోనూ బిజెపి ప్రభుత్వాన్ని భుజాన మోశారు. కేంద్ర మంత్రులను మించి ప్రతిపక్షంపై విరుచుకు పడ్డారు. మణిపూర్ సంక్షోభంపై, పార్లమెంటు భద్రతకు భంగంపై చర్చ చేయాలని ప్రతిపక్షాలు ఎంత పట్టుబట్టినా ఒప్పుకోలేదు. మొండిగా నిరాకరించారు. కుస్తీ క్రీడాకారిణి వినేష్ ఫోగట్ పై దౌర్జన్యం జరిగినప్పుడూ చర్చ నిరాకరించడమే కాక మీరు ఒక్కరే మహిళా పక్షం కాదని ప్రతిపక్షాలపై దాడి చేశారు. మోడీని ప్రశంసలతో ముంచెత్తడమే కాక తాను ఆర్.ఎస్.ఎస్ ఏకలవ్య శిష్యుడినని కూడా ప్రకటించుకున్నారు. జగదీప్ ధన్‌ఖడ్ మరింతగా పేరు మోసింది న్యాయ వ్యవస్థపై దాడికి. రాజ్యాంగ మౌలిక స్వభావం అన్న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును కూడా ఆయన తప్పు పట్టారు. గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా తిట్టిపోశారు. ఇంతగా బిజెపికి కొమ్ము కాసిన వ్యక్తి నిర్లక్ష్య పూరితంగా నిష్క్రమించడం ఎందుకు సంభవించింది? అంతగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలే ఆయనను గురించి మాట్లాడాల్సిన పరిస్థితి ఏమిటి? ఇదేదో ప్రతిపక్షాల అవకాశవాదమైనట్లు కొంతమంది వ్యాఖ్యాతలు చెప్పడం సరైనదేనా?

### గత అనుభవాలు

ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే మనం రాజ్యాంగ నిబంధనలు, రాజకీయ వాస్తవాలు, వాటి స్ఫూర్తిని అర్థం చేసుకోవాలి. ఉప రాష్ట్రపతి పదవి అలంకారప్రాయమే గాని ఛైర్మన్‌గా రాజ్యసభ నడిపించటం ఒక కీలక అంశం. మరణం వంటివి సంభవిస్తే తాత్కాలికంగా రాష్ట్రపతి బాధ్యతలను కూడా ఆ పదవిలోని వారు నిర్వహించవలసి ఉంటుంది. గతంలో వి.వి.గిరి, బి.డి.జెట్టి ఆ విధంగా రాష్ట్రపతి బాధ్యతలు నిర్వహించారు. ఫకృద్దీన్ అలీ అహ్మద్ హఠాత్తుగా మరణించడంతో ఎమర్జెన్సీ అనంతరం జనతా ప్రభుత్వం ఏర్పడినప్పుడు బి.డి.జెట్టి ఆ బాధ్యతలు నిర్వహించారు. చాలా సందర్భాల్లో ఉప రాష్ట్రపతులుగా ఉన్నవారు తదుపరి రాష్ట్రపతులుగా ఏకగ్రీవంగానో ఎన్నికలకు రావడం కూడా చూశాం. సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకిర్ హుస్సేన్, వి.వి.గిరి, ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ వంటి వారే అలా అత్యున్నత పదవిలోకి వచ్చారు. ఉప రాష్ట్రపతి స్థానంలో ఉన్నవారు పరిపక్వతతో గౌరవంగా వ్యవహరించటం పరిపాటి. కొన్నిసార్లు ఒడిదుడుకులు వచ్చినా ప్రభుత్వాధినేతలు సర్దుబాటు చేసుకునేవారు. నెహ్రూ హయాంలో రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయనపై కాంగ్రెస్ నాయకులు కొందరు విమర్శలు చేశారు. వాటిని నెహ్రూ ఖండించక పోవటంపై ఆయన కొంత బాధపడినట్లు కథనాలు వచ్చాయి. కానీ నెహ్రూ మామూలు సంబంధాలు పాటించడమే కాక తన సమక్షంలో ఎవరూ అలా అనలేదని చెప్పడం ద్వారా అపార్థాలు తొలగించారు. శంకర్ దయాళ్ శర్మ రాజ్యసభ నిర్వహిస్తుండగా అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ నాయకుల నిరసనలతో మనస్థాపానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అప్పుడు కూడా కేంద్ర పెద్దలు సర్దుబాటు చేయడమేకాక తర్వాత వామపక్షాల సహకారంతో ఆయనను రాష్ట్రపతిని కూడా చేశారు. ప్రధాని పి.వి.నరసింహారావు హయాంలో సంఘ పరివార్ నేతలు బాబ్రీ మసీదు విధ్వంసానికి పాల్పడినప్పుడు ప్రధాని కన్నా ముందే తను స్పందించడం ద్వారా శర్మ ఆ పదవి గౌరవాన్ని కాపాడారు. వాజ్‌పేయి హయాంలో ఉప రాష్ట్రపతిగా ఉన్న కృష్ణకాంత్‌ను రాష్ట్రపతి చేస్తానని స్వయంగా ప్రతిపాదించి తర్వాత హఠాత్తుగా మార్పు చేయడంతో ఆయన మనస్థాపానికి, అనారోగ్యానికి గురయ్యారు (హఠాత్తుగా మరణించారు కూడా). మహ్మద్ అలీ అహ్మద్ అన్సారి ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు సంఘపరివార్ మనుషులు ఆయనపై మత ముద్రతో విష ప్రచారం చేయడం తీవ్ర విమర్శకు గురైంది. అయితే ఇవి చాలా వరకూ ఆ పదవిలో ఉన్నవారు గాక అధికార పక్షంలోని వారు చేసిన తప్పులు. ధన్‌ఖడ్ కథ అందుకు భిన్నం. మోడీ హయాంలో మిగిలిన అన్ని వ్యవస్థల లాగే అత్యున్నతమైన రెండు వ్యవస్థలు కూడా ఆయన అభీష్టం ప్రకారమే నడవాల్సి వచ్చిందని అనుభవాలు చెబుతున్నాయి. వెంకయ్య నాయుడు ఒక దశలో మోడీ కన్నా సీనియర్ అయినప్పటికీ ఆ పదవిలో మాత్రం ఆనందించింది లేదంటారు. అభిమానులు ఎన్ని కథలు వదిలినా తనకు తదుపరి మిగిలిన అత్యున్నత పదవి దక్కింది లేదు. రాష్ట్రపతిగా పనిచేసిన రామ్‌నాథ్ కోవింద్‌కు జమిలి ఎన్నికల నివేదిక పని అప్పగించి మోడీ తన మాటే శాసనమని తెలిసేలా చేశారు. పార్లమెంటు నూతన భవనాల ప్రారంభం సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకుండా అలక్ష్యం చేశారు. ఇప్పుడు దిగిపోయిన ధన్‌ఖడ్ తనకు వంత పాడినంత కాలం ముందుకు నెట్టి కాస్త తేడా రాగానే కరివేపాకులా తీసి పడేశారు మోడీ. ఇంతకూ వారికి తేడా ఏం వచ్చింది?

### శ్రుతి మించిన అతి

ఎంత పెద్ద పదవిలోకి వచ్చినా అధికార దర్పంతో, అవకాశ వాదంతో వ్యవహరించే నేతలకు శృంగభంగం అనివార్యమని జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి నిరూపించారు. వ్యక్తిగతంగా ఆయనకు పదవి పటాటోపం, దుందుడుకుతనం ఎక్కువ. స్వతహాగా ఆర్.ఎస్.ఎస్ నేపథ్యం లేని ఆయన వారిని మెప్పించడం కోసం శృతి మించి వ్యవహరిస్తూ వచ్చారు. అలంకార ప్రాయమైన ఈ పదవిని అతి శక్తివంతమైనదిగా భ్రమించి హద్దు మీరి వ్యవహరించారు.

# ఇజ్రాయెల్‌ను ఒంటరి చేయడమే ఏకైక మార్గం!



ఇజ్రాయెల్,గాజాలో ఇజ్రాయెల్ సామూహిక నరమేధానికి పాల్పడుతున్నది. ఒకజాతి మొత్తాన్ని సంహరించేలా చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రోజుకు వందలాది మందిని హత్య చేస్తున్నది. మానవతా సహాయం, ఆహారం, వైద్య కోసం ఎదురుచూస్తున్న వారిపై సైతం బుల్లెట్లు, బాంబుల వర్షం కురిపిస్తున్నది. దీంతో 2023 అక్టోబర్ నుంచి సుమారు 60-80 వేల మంది వరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18 వేల మంది చిన్నారులు ఉ ండగా, 15 వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విధించిన దిగ్బంధం వల్ల ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సామాగ్రి వంటి ప్రాథమిక అవసరాలు కూడా గాజాకు అందడం లేదు. దీనివల్ల ఆకలి చావులు, వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80 శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. గత కొన్ని రోజుల్లో ఆహార సహాయ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ సైనికులు జరిపిన కాల్పుల్లో 875 సాధారణ మంది పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి (%ఖఅ్‌వస చీఫ్‌అశీఅం%) నివేదించింది. అంతేకాకుండా సుమారు 19 లక్షల మంది నిర్వాసితులుగా మారారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని, మానవతా సహాయానికి అనుమతించాలని ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇటీవల 28 దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇందులో ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఎస్టోనియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐస్‌లాండ్, ఐర్లాండ్, ఇటలీ, జపాన్, లాట్వియా, లిథువేనియా, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, పోలాండ్, పోర్చుగల్, స్లోవేనియా, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, గ్రీస్, మాల్టా, సైప్రస్ దేశాలు ఉన్నాయి. కాగా, వీరి డిమాండ్‌ను ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీన్ని బట్టి చూస్తే ఈ 28 దేశాలు ప్రకటనలకే పరిమితమైతే ఎలాంటి లాభం ఉ ండదని స్పష్టమవుతున్నది. ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశాన్ని ఒంటరిచేసేలా కఠిన ఆంక్షలు విధించాల్సిన అవసరమున్నది. గాజాలో యుద్ధ విరామం, మానవతా సహాయం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే పలు దేశాలు చర్యలు మొదలుపెట్టాయి. ఇజ్రాయెల్ చర్యల కారణంగా వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షించాల్సిన అవసరముందని ఇయు విదేశాంగ విధాన ప్రధాని కాజా కల్లాస్ ప్రకటించారు. యుకె ఇప్పటికే ఇజ్రాయెల్‌తో వాణిజ్య చర్చలను నిలిపివేసింది. ఇజ్రాయెల్‌కు ఆయుధ బదిలీలు ఆపాలని యుఎన్ నిపుణులు సైతం హెచ్చరించారు. యుకె, మరికొన్ని దేశాలు ఆయుధ లైసెన్సులను కొంతవరకు నిలిపివేశాయి. బెలిజ్ ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను నిలిపివేసింది. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా, స్పెయిన్ 2024లో పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. యుఎన్ జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్ కూడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపడానికి, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఇది చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. అంటే ఫ్రాన్స్ జి7 దేశాల్లో పాలస్తీనాను దేశంగా గుర్తించే మొట్టమొదటి రాజ్యంగా నిలవనుంది. గాజాలో నరమేధాన్ని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఇప్పటికే ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. యుద్ధ నేరాలకు గాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ పై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఇజ్రాయెల్ పై కఠిన ఆంక్షలు విధించడం ద్వారానే ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావచ్చు. ముందుగా ఆయుధాల ఎగుమతులపై పూర్తి నిషేధం విధించాలి. పాలస్తీనాకు దేశ గుర్తింపును ఇవ్వడం ద్వారా దీర్ఘకాలిక మద్దతు అందించవచ్చు. ఐసిజె, ఐసిసి వంటి అంతర్జాతీయ న్యాయస్థానాల్లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై మరిన్ని కేసులు వేసి చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేయొచ్చు. గాజాలో 92% గృహాలు, 88% పాఠశాలలు ధ్వంసమయ్యాయని యుఎన్ నివేదికలు స్పష్టం చేశాయి. ప్రపంచ దేశాలు గాజా పునర్నిర్మాణానికి నిధులను కేటాయించడం ద్వారా దీర్ఘకాలిక సహాయాన్ని అందించవచ్చు. ఇది విద్య, ఆరోగ్యం, జీవనోపాధికి దోహదపడుతుంది. మరోవైపు అన్ని దేశాల ప్రజలు సైతం ఇజ్రాయెల్ పై ఒత్తిడి పెంచే చర్యలకు సిద్ధం కావాల్సిన అవసరమున్నది. ఇప్పటికే అనేక దేశాల్లో పాలస్తీనాకు మద్దతుగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఇది ఆయా దేశాలు తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయగలవు. బాయ్ కాట్, డైవెస్ట్‌మెంట్, శాంక్షన్స్ (బిడిఎస్) ఉద్యమం ద్వారా ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలని యూరోపియన్ దేశాలను కోరుతున్నారు. రఫా క్రాసింగ్ ద్వారా ఆహారం, నీరు, వైద్య సామాగ్రిని గాజాకు చేరవేయడానికి ఈజిప్ట్‌తో సమన్వయం చేసుకోవాల్సిన అవసరముంది. 28 దేశాల సంయుక్త ప్రకటన గాజా సంక్షోభాన్ని ఖండించడంలో ఒక ముఖ్యమైన అడుగు. కానీ ఇది కేవలం మౌఖిక సందేశంగా మిగిలిపోకూడదు. గాజాలో నిరాయుధులు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, ఆకలి చావులు, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించే ధైర్యం చేయాలి. అప్పుడే గాజా ప్రజలకు న్యాయం సాధ్యమవుతుంది.

# బిసిల ఛాంపియన్ ఎవరు?



హైదరాబాద్,వెనుకబడిన కులా(బిసి)లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కంకణబద్ధుడై ఉన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఈ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేసి కేంద్రానికి పంపించింది. ఈ బిల్లు విద్య, ఉద్యోగావకాశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల అంశానికి ముడిపడి ఉంది. కేంద్రంలో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈ బిల్లుకు అంత తేలిగ్గా ఆమోదం పొందదని భావించిన రాష్ట్ర మంత్రివర్గం మరో అడుగు ముందుకేసి ఆర్డినెన్స్ (ముసాయిదా)కు ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసినట్లయితే ఆర్డినెన్స్ కాలపరిమితి ఆరు నెలలు కాబట్టి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేయాలని ముఖ్యమంత్రి భావన. అయితే బిల్లు కేంద్రానికి పంపించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మనే అదే రిజర్వేషన్ల అంశానికి సంబంధించి తన ముందుకు వచ్చిన ఆర్డినెన్స్‌కు ఆమోదం (%ూజూ-జూతీశీఝశ్రీ శీతీఎఱఅఱఅవ%) తెలుపడానికి వెనుకాడక తప్పలేదు. ఎందుకంటే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా, అదే అంశంపై ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఎలా క్లియరెన్స్ ఇవ్వగలరన్నది ప్రశ్న. దీంతో గవర్నర్ న్యాయ నిపుణుల సలహా తీసుకున్నారు. అంతేకాకుండా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకూ పంపించారు. తాను ముసాయిదా ఆర్డినెన్స్‌కు క్లియరెన్స్ ఇస్తే ఎదురయ్యే న్యాయ, చట్టపరమైన చిక్కులు ఏమైనా ఎదురవుతాయా? అనే సందేహాలను వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉంది. మరోవైపు సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూలును కేంద్రం సవరించాల్సి ఉ ంటుంది. ఈ సవరణ జరిగితే మిగతా రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్ల అంశం తెరపైకి వస్తుంది. బీహార్ రాష్ట్ర ప్రభుత్వం లోగడ అరవై శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రయత్నించగా, సుప్రీం కోర్టు బ్రేక్ వేసింది. తమిళనాడు ప్రభుత్వం 62 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంది కదా అనే సందేహాలూ లేకపోలేదు. కానీ రిజర్వేషన్ల చట్టం అమలులోకి రాక ముందే అన్నామలై కాలంలో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. కాబట్టి ఆ రాష్ట్రంతో పోల్చుకోవడానికి వీల్లేదు. తమిళనాడు ప్రభుత్వం తాజాగా మూడు బిల్లులను గవర్నర్ ఆమోదం లేకుండానే అమలులోకి తీసుకుని వచ్చింది. చట్ట సభలు ఆమోదించి పంపించే బిల్లులకు గవర్నర్, రాష్ట్రపతి మూడు నెలల్లోగా ఆమోదం తెలపకపోతే అవి గడువు ముగియగానే చట్టాలుగా మారుతాయని సుప్రీం కోర్టు ధర్మాసనం చెప్పడంతో మూడు బిల్లులను గవర్నర్ ఆమోదం లేకుండానే చట్టాలుగా అమలు చేస్తున్నది. రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఎఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రభృతులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. దీంతో రేవంత్ బిసి ఛాంపీయన్‌గా చరిత్రలో నిలబడతారన్న ప్రచారమూ ఊపందుకుంది. కాగా, వెనుకబడిన కులాలను ఆకర్షించడంలో వెనుకబడి పోతున్నామని బిజెపి రాష్ట్ర నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ బిసిలను హైజాక్ చేసిందని, దీనిని అధిగమించి బిసిలను తమ వైపు తిప్పుకోవడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బిజెపి భావిస్తోంది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించడం గొప్ప విషయమైనా, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పడుతుంది కాబట్టి ఈలోగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బిజెపి నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నగరంలోని ఒక హోటల్‌లో బిజెపి ఒబిసి మోర్చా సమావేశమై తర్జన-భర్జన పడింది. బిజెపి రథసారథిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్.రామచందర్ రావు రెండు రోజుల క్రితం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బిసి బిల్లు ఆమోదం పొందడం అంత తేలికయ్యే పని కాదని, దీనికి రాజ్యాంగం లోని తొమ్మిదవ షెడ్యూలును సవరించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా బిల్లును కేంద్రానికి పంపించి నెపం కేంద్రంపై వేసి, రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ చూస్తున్నదని తూర్పారబట్టారు. దీనిని కాంగ్రెస్ తీవ్రంగా ఆక్షేపించింది. బిసి బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపదన్న సంకేతాన్ని రామచందర్ రావు ఇచ్చారన్న అనుమానాన్ని కాంగ్రెస్ వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బిసి బిల్లు బంతిని కేంద్రం కోర్టులోకి వేసినందున, కేంద్రం తీసుకునే నిర్ణయంపై కూడా బిజెపి రాష్ట్ర నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేంద్రం నో చెబితే ఇక్కడ బిజెపికి చాలా సమస్య ఎదురవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు చట్ట సవరణ చేసి బిసిలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బాగుంటుందన్న భావన, ఆశ బిజెపి రాష్ట్ర నాయకులకు ఉన్నా అంత తేలికయ్యే అంశమేమీ కాదు. దానికి ఎన్నో అవాంతరాలు రాకతప్పదు. సుప్రీం కోర్టు ఇప్పటికే యాభై శాతం రిజర్వేషన్లు దాట రాదని ఆదేశించింది. అలా చేస్తే ఇతర కులాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలైనా, మరే ఏ ఎన్నికలైనా బిసిల ఓట్లే కీలకం కాబట్టి అన్ని పార్టీలూ బిసి అజెండాతో జెండాలు పైకెత్తి ముందుకు సాగుతున్నాయి. బిల్లు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆమోదించేలా చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ నేతల డిమాండ్. కాంగ్రెస్ ఆ దిశగా చర్యలు చేపట్టకుండా సభలు, సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లతో కాలయా పన చేస్తున్నదన్న విమర్శల దాడి చేస్తున్నది. ఈ బిల్లును చట్టంగా చేయాలంటూ కోరుతూ బిసి బిల్లును కేంద్రం కోర్టులోకి నెట్టి వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతమైందని చెప్పవచ్చు. దీంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని నిర్ణయించింది .కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టినప్పుడే బిసిల దయ నీయమైన పరిస్థితిని చూసి తాము అధికారంలోకి రాగానే బిసిలకు సరైన గుర్తిం పు ఇచ్చేందుకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు ఢంకా భజాయించి చెబుతున్నారు. అయితే కేంద్రంలో అధికారంలోకి రాలేకపోవడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాహుల్ ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రయత్నించారన్నది స్పష్టమవుతున్నది. బిసి రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం చట్టంగా మార్చకపోతే నెపం ఎన్‌డిఎపైనే పడుతుంద న్నది మరో వాదన. ఎన్నికల సమయంలో నెపం కేంద్రంపై వేసేలా కాంగ్రెస్‌కు ఓ అస్త్రం సిద్ధమైంది. దీనిని తిప్పికొట్టేందుకు బిజెపికి ఇప్పుడు ఆయుధం కావాలి. కాబట్టి జనగణనతో పాటు కులగణనకు శ్రీకారం చేపడతామని ప్రకటించింది. రేవంత్ రెడ్డి కదిలించిన బిసి బిల్లు తేనె తుట్టె అన్ని పార్టీలనూ ఇరకాటంలో పెట్టింది.

### 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు

శ్రీకాకుళం,ఆరుగాలం శ్రమించే రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలని దేశంలోనే తొలిసారిగా కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయానికి ఉ పయోగించే డ్రోన్ ను ప్రారంభించి, డ్రోన్ పనితీరును పరిశీలించి, నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు డ్రోన్ ను పంపిణీ చేశారు.

# గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులు

అమరావతి,గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు- పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పహల్గామ్ ఉగ్రవాదుల హతం

శ్రీనగర్,జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకులైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు- సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ - లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు-పెట్టినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు- నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు- ప్రాథమికంగా నిర్ధరించారు.

# పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్రలు

అమరావతి,ఏపీకి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో అడ్డుకుంటోందని.. పిల్ల సైకోల విష ప్రచారం శ్రుతి మించుతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రముఖ కంపెనీలు గూగుల్, టీ-సీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు వస్తే.. వాటిపైనా దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తును ఐదేళ్లు నాశనం చేసిన జగన్.. నేడూ అదే ధోరణిని అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్, సిలికాన్ స్కామ్, శాండ్ స్కామ్, ల్యాండ్ స్కాములు బయట పడటంతో వైకాపా నేతలు రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తూ పూర్తిగా అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వైకాపా నేతలు తమ కుంభకోణాల బాగోతాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. ఈసందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పల్లా శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పిల్ల వైసీపీ సైకోల విష ప్రచారం సృతి మించుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి వచ్చే పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. దెయ్యాల్లా మంచిని జీర్ణించుకోలేక గోల చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని దుయ్యబట్టారు. నీచ రాకీయాలు, అబద్ధాలతో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి రాక్షస మూకల, సైకో దెయ్యాల కోరలు పీకి పాతాళానికి తొక్కాలని హెచ్చరించారు. అప్పుడే ప్రజలకు మనశ్శాంతి..

ధర్మఘంట
తెలుగు దినపత్రిక



## రాజకీయ నిరంకుశం ప్రమాదం

న్యూఢిల్లీ,అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఎన్టీఆర్ లాంటి వారు కూడా ప్రజాగ్రహంలో కొట్టుకు పోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అడ్రస్ లేకుండా పోయారు. ప్రజలు ఛీదరించుకుంటే ఎంతటి వారైనా మట్టి కరవాల్సిందే. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమత బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమత బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. పశ్చిమ బెంగాల్లో ముఖ్యమంత్రి మమత బెనర్జీ అభివృద్దిని పక్కన పెట్టి బుజ్జగింపురాజకీయాలను చేస్తున్నారు. తెలంగాణలో ఇలాగే ఓటమికి ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడనేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. అప్పులు కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలుచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ జగన్ ఇద్దరూ తమ ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. అప్పులతో రాష్ట్రాలను కొలుకోకుండ చేశారు. అధికారంలో ఉన్నవారు అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో నేతలు విఫలమవుతున్నారు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడుపుతున్నారు. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉంటే జరిగే అనర్థాలకు జగన్, కెసిఆర్లు ప్రత్యక్ష ఉదాహరణలు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగన్లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వీరిద్దరూ ఇప్పుడు ప్రతిపక్షానికి కూడా పనికి రాకుండా పోతున్నారు.

## ప్రపంచాన్ని వణికిస్తున్నహెపటైటిస్

న్యూఢిల్లీ,పంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము. హెపటైటిస్ బీ వైరస్ను కనుగొన్న నోబెల్ గ్రహీత బరూచ్ శామ్యూల్ బ్లంబర్గ్ కు గుర్తుగా ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజును ఏర్పాటు చేశారు. ప్రస్తుత కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళు ,, నిద్రలేమితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నారు. ఇందులో హెపటైటిస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయం (లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటిస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోసిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..కాలేయ వ్యాధి ఎక్కువగా ఎవరికి వస్తుంది. ఈ వ్యాధి అధికంగా మద్యం సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినప్పుడు కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటిస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా.. ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటిస్ అంటారు. ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్ల వల్ల కాలేయం కేన్సర్కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది..లివర్ క్యాన్సర్ ముప్పుహెపటైటిస్ ఇన్ఫెక్షన్ లివర్ క్యాన్సర్కు కూడా దారి తీసే అవకాశం ఉ ంది. సాధారణ కాలేయ క్యాన్సర్ను హెపటో సెల్యులార్ క్యాన్సర్ అని అంటారు. దీర్ఘకాలికంగా ఆల్కహాల్ తీసుకునే వారికి ఈ వ్యాధి ఏర్పడుతుంది. దీన్ని కడుపు పైభాగంలో నొప్పితో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలతో గుర్తించవచ్చు. పసికికలు, నీళ్ల విరేచనాలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ప్రాథమికంగా రక్తపరీక్ష (ఎఫ్బీ), అల్ట్రా సౌండ్ పరీక్షలతో గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి సిటీ స్కాన్, ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించాల్సి ఉ ంటుంది.'వన్ లైఫ్, వన్ లివర్'.ఈ సంవత్సరం 2023, ప్రపంచ హెపటైటిస్ డే థీమ్ ' వన్ లైఫ్, వన్ లివర్ '. వైరల్ హెపటైటిస్ నివారణ, రోగనిర్ధారణ మరియు చికిత్సను మెరుగుపరచడానికి అవసరమైన కొలతలను వేగవంతం చేయడానికి, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా 2030 హెపటైటిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్నారు.

## కాస్తైనా ఏమీ అనిపించదా?

సెంట్రల్ డెస్క్ఎవరు ఎన్ని చెప్పినా.. ఎవరు ఎంత చెప్పినా.. వాస్తవం ఏమిటో తనకు పూర్తిగా తెలిసినా.. ట్రంప్ మాత్రం మారడం లేదు! తనకు అనిపించింది చెప్పుకుంటూ, చేసుకుంటూ పోతున్నారు! నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ట్రంప్ వ్యవహారశైలి ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి భారత్ - పాక్ మధ్య జరిగిన యుద్ధం గురించి ప్రస్తావించారు.అయితే మొన్న భారత్ - పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని.. ఇటీవల ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం ఆగడానికి తానే కారణమని.. అయినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని చెప్పుకుంటున్న ట్రంప్.. శాంతి బహుమతి ప్రేమతో గెలిస్తే వస్తుంది తప్ప.. బెదిరింపో, బలవంతం పెట్టో చేయిస్తే రాదనే విషయాన్ని మరిచిపోతున్నారనే మాటలకు అవకాశం ఇస్తున్నారు! ఈ క్రమంలో తాజాగా థాయిలాండ్ - కంబోడియా దేశాల మధ్య మొదలైన ఘర్షణపై స్పందించారు. ఈ సమయంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు తనకుతానే ప్రకటించారు. తాను కంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయ్ ప్రధాని ఫుమ్థామ్ వెచియాచైతో మాట్లాడినట్లు చెప్పిన ట్రంప్.. వారు యుద్ధం కొనసాగిస్తే..

# తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ యూరియా వార్!



హైదరాబాద్, రాష్ట్రానికి యూరియా సరఫరా తగ్గుదల విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం నెలకొన్నది. రెండు పార్టీలు సవాళ్లు, ప్రతిసవాళు విసురుకుంటున్నాయి. రాష్ట్రంలో ఉన్న డిమాండ్కు అనుగుణంగా యూరియాను కేంద్రం సరఫరా చేయలేదని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. బీజేపీ మాత్రం అవసరానికి మించే పంపామని చెబుతున్నది. వీళ్ల ఆరోపణలు, ప్రతిసవాళ్లు ఎలా ఉన్నా.. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల వద్ద బారులు నిలబడుతున్నారు. వర్షాలు కురిసినందున యూరియాకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అవసరమైన యూరియాను సరఫరా చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

### ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు?

తెలంగాణలో జూలై 16 నాటికి 61,10,170 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 61,63,098 ఎకరాల్లో పలు పంటలు సాగయ్యాయి. తెలంగాణలో సాధారణ ఖరీఫ్ (వానకాలం) విస్తీర్ణం 66,41,809 ఎకరాలు. సీజన్ ప్రారంభమైన తర్వాత వర్షపాతం సరిగా నమోదు కాలేదు. రుతుపవనాల ప్రారంభంలో చెదురుమదురు వర్షాలు కురిశాయి తప్ప ఆశించినంత మేరకు లేవు. దీంతో విత్తనాలు వేసిన రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూశారు. జూలై 17 నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్నిజిల్లాల్లో భారీ వర్షాలు కూడా నమోదయ్యాయి. ఇంకా రెండు రోజుల పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉ ందని వాతావరణ శాఖ చెబుతున్నది. వర్షాలు కురవడంతో యూరియాకు ఇంకా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. యూరియా సకాలంలో వాడకపోతే పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### తెలంగాణకు ఎంత యూరియా సరఫరా చేశారు?

తెలంగాణ రాష్ట్రానికి 2024-25 ఖరీఫ్ సీజన్కు తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. అయితే ఇప్పటివరకు కేటాయించిన యూరియా సరఫరా చేయలేదు. 45 శాతం యూరియా ఇంకా రాలేదని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. దీంతో రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారనేది రాష్ట్ర ప్రభుత్వం వాదన. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉంది. కానీ.. 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి. దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉ ందనేది ప్రభుత్వ వాదన. ఏప్రిల్ లో 1.70 లక్షల టన్నుల యూరియాకు గాను 1.22 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది. ఇక మేలో 1.60 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలి. కానీ, సప్లయ్ 0.88 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది. జూన్ లో 5 లక్షల టన్నులు అవసరం ఉంటే.. 3.06 లక్షల టన్నులే వచ్చాయి. జూలైలో కేంద్రం 1.60 లక్షల టన్నుల యూరియా కేటాయించింది. అందులో 63వేల టన్నుల దేశీయ యూరియా, మిగిలినది విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదాని నుంచి పంపుతామని తెలిపింది. అయితే ఇప్పటివరకు 29,000 టన్నులు మాత్రమే వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నది. జూలై 8న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. రాష్ట్రానికి నెలలవారీగా యూరియా కేటాయింపు, సరఫరా మధ్య తేడాను వివరిస్తూ కేటాయింపు మేరకు సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

### తుమ్మలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సవాల్

యూరియా కేటాయింపు, సరఫరాలో తేడా ఉన్న విషయాన్ని కేంద్రానికి ఈ నెల 2న తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని కోరారు. ఈ వాదనను బీజేపీ తోసిపుచ్చింది. రాష్ట్రానికి 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నులను పంపిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు చెప్పారు. దీనిపై చర్చకు తాను సిద్ధమని మంత్రి తుమ్మలకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో డిమాండ్ కంటే ఎక్కువ పంపినా ఎరువులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు చేయాలని రామచందర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. మరో వైపు రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయింపులో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరో వైపు ఎరువుల బాధ్యత కేంద్రానిదేనని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎరువులు సరఫరా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వ్యవసాయం గురించి ఏం తెలుసునని రామచందర్ రావు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

### సరఫరా ఆలస్యానికి కారణం ఏంటి?

జూలైలో 1.60 లక్షలు యూరియా సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అయితే ఇందులో 60 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన యూరియా. ఈ యూరియా రావడానికి అవసరమైన నౌకలను కేంద్రం కేటాయించాలి. మరోవైపు తెలంగాణలో ఉన్న రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి తెలంగాణకు ఇచ్చే కోటా 30,800 టన్నులు. అయితే ప్రస్తుతం ఉన్న డిమాండ్ నేపథ్యంలో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి 60 వేల టన్నుల యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయితే ఈ ఫ్యాక్టరీ నుంచి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు సరఫరా చేస్తారు. దిగుమతి చేసుకున్న యూరియా కోసం అవసరమైన నౌకలు కేటాయిస్తే యూరియా సమస్య తీరిపోయే అవకాశం ఉందంటున్నారు. మరో వైపు రాష్ట్రానికి అవసరమైన యూరియా, ఎరువుల విషయంలో కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సకాలంలో ఎరువులు పంటలకు వాడకపోతే తెలంగాణలోని 53.51 లక్షల హెక్టార్ల సాగు భూమిలో దిగుబడి 10-15 శాతం తగ్గుతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరించారు.

## దళిత యువకుడి దారణ హత్య

చెన్నై,తమిళనాడులో 27 ఏళ్ల దళిత యువకుడిని దారుణంగా హత్య చేశారు. తూత్తుకుడికి చెందిన కవిన్ తిరునెల్వెలిలోని ఓ ప్రైవేటు- ఆస్పత్రి సమీపంలో హత్యకు గురయ్యాడు. కవిన్ ఒక ఐటీ- సంస్థలో పని చేస్తున్నాడు. అతడు కెటిసి నగర్లోని ఒక ప్రైవేటు- ఆస్పత్రిలో పని చేస్తున్న తన మాజీ స్కూల్ విధ్యార్థిని రిలేషన్లో ఉన్నట్లు- సమాచారం. అయితే వీరిద్దరి వివాహానికి అమ్మాయి కుటు-ంబసభ్యులు అంగీకరించలేదు. కానీ, కవిన్ మాత్రం ఆ అమ్మాయినే పెళ్లి చేసుకువాలని పట్టు-దలతో ఉండేవాడు. దీంతో ఆదివారం ఆమెను కలిసేందుకు ఆమె పని చేస్తున్న ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఉన్న అమ్మాయి సోదరుడు సుర్జిత్.. కవిన్ని అడ్డుకున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది.

# పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం

న్యూఢిల్లీ,వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉద్యం కూడా ఇదే తరహాలో మధ్యాహ్నానికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వా లని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభాపతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రధాని మోడీ, పార్లమెంటరీ



వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై వారం రోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. వాయిదా తీర్మానాలతో విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడా ఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభలకు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేయాలి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యలపై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజలు ఓ కంట కనిపెడుతుంటారని గుర్తించాలి. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేందుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం.

# వ్యవసాయం అతిపెద్ద ఉత్పాదక రంగం

న్యూఢిల్లీ,స్వవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయరంగ నిపుణులు ఇదే అభిప్రాయ పడుతున్నారు. నిరుద్యోగులు గ్రామాలకు తరలాలని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్బీఎఫ్సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని నిపునుల హెచ్చరికలు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు, ఎన్బీఎఫ్సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి.


## సింగపూర్లో హౌజింగ్ నిర్మాణాల పరిశీలన

అమరావతి,సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు క్షేత్ర స్థాయి పర్యటనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. సోమవారం సింగపూర్లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ- ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు- సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. కొత్త ఆలోచనలతో, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం ఉత్తమ విధానాలు అనుసరిస్తూ భవిష్యత్ నగరాన్ని తీర్చిదిద్దుతున్నట్టు- చెప్పారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ - ఏపీ ప్రభుత్వాల మధ్య కొంత అంతరం వచ్చిందన్న అంశాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంతో పాటు-.. ఉన్న గ్యాప్ ను తగ్గించేందుకు ప్రస్తుతం తాను సింగపూర్ వచ్చానని తెలిపారు. భవిష్యత్లోనూ సింగపూర్-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. బిడదారి ఎస్టేటులో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టిన విధానాన్ని సింగపూర్ అధికారులు చంద్రబాబుకు వివరించారు. చెట్లు- తొలగించకుండా, సహజ నీటి వనరులు దెబ్బతినకుండా... ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ప్రకృతితో మమేకమయ్యేలా చేపట్టిన ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవడంతో పాటు-.. ఆహ్లాదాన్ని పంచే విధంగా నిర్మాణాలు చేపట్టామని ఆ దేశ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గృహ సముదాయాల నిర్మాణం ఖర్చు ఏ మేరకు ఉందనే అంశం పైనా చంద్రబాబు వారితో చర్చించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు- ధరల్లో ఉండేలా చూడడంతో పాటు-.. నాణ్యమైన నివాస గృహాల నిర్మాణాల చేపట్టామని చంద్రబాబుకు సింగపూర్ అధికారులు చెప్పారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు తీర్చిదిద్దిన తీరును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. సింగపూర్ ప్రభుత్వం చేపట్టిన ఈ హౌసింగ్ ప్రాజెక్టు అన్ని వసతులతో పర్యావరణ హితంగా అద్భుతంగా నిర్మించారని చంద్రబాబు కితాబిచ్చారు. స్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్క్గా సింగపూర్ అర్బన్ రీడెవల్పమెంట్ అథారిటీ- మార్చడం ఆకట్టు-కుందని చంద్రబాబు అన్నారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు సందర్శన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు, సింగపూర్ అర్బన్ రీడెవలప్మెంట్ అథారిటీ-, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్ ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీలో చేపట్టనున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై ఈ భేటీ-లో చర్చించారు.

## విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం టెండర్లు

అమరావతి, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో ఈ -టె-ండర్లను ఆహ్వానించింది. ఫేజ్-1లో 38.4 కి.మీ మేర రెండు కారిడార్లలో విజయవాడ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్-1లో నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం బస్టాండ్ వరకు.. కారిడార్-2లో బస్స్టేషన్ నుంచి పెనమలూరు వరకు మెట్రో నిర్మాణం జరగనుంది. కారిడార్-1లో 4.7 కి.మీ మేర డబుల్ డెక్కర్ ÷-లఫైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. 32 చోట్ల మెట్రో స్టేషన్లు, ఒక చోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ రానుంది.

# ఏఐ వినియోగం మంచికా.. చెడుకా!?




హైదరాబాద్,ఈ మధ్య కాలంలో మనల్ని మనమే మరిచిపోతున్నట్టు ఉంది! ఎందుకంటే ఏ విషయమైనా చిన్నదీ, పెద్దదీ.. తెలిసినది, తెలియనిదీ ఇలా ప్రతీ దానికి ఏఐనే వాడేసుకుంటూన్నారు. మన మేధస్సు మీద కాకుండా ఏఐ (కృత్రిమ మేధ) మీదే పూర్తిగా ఆధారపడిపోతున్నాం. ఉదాహరణకి, దారితెలుసుకోవాలన్నా, వంటల రుచి పెరగాలన్నా, ఇంటర్వ్యూకి రెడీ అవాలన్నా ప్రతిదానికీ గూగుల్, చాట్‌బాట్‌లు, ఏఐ టూల్స్ వద్దరకు పరుగులు తీస్తున్నాం.ఇప్పటికి చాలామంది 'ఒక్కసారి గూగుల్ చెక్ చేయాలి', 'దీని మీద యూట్యూబ్‌లో చూడాలి', 'చాట్‌జీపీటీలో అడుగుదాం' అని తలచుకుంటున్నారు. ఇది చూస్తే భవిష్యత్తులో మన మెదడు పని చేయడమే మర్చిపోతుందేమో అనిపిస్తుంది. మనం ఆలోచన చేసే సామర్థ్యాన్ని, విషయాలను విశ్లేషించే శక్తిని మెల్లగా పక్కన పెడుతున్నాం. అని డీప్ మైండ్ అనే ప్రపంచ ప్రఖ్యాత ఏఐ సంస్థ సీఈఓ డెమిస్ హస్సాబిస్ మాత్రం స్పష్టంగా చెప్పారు"ఏఐ గొప్పది, సహాయకారి. కానీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదు. మన మెదడు పనిచేయకుండా కృత్రిమ మేధపై పూర్తిగా ఆధారపడితే అది సరి కాదని" హెచ్చరిం చారు.ప్రస్తుత తరంలో కృత్రిమ మేధస్సు అభివృద్ధి వేగంగా జరుగుతోంది. అయితే, ఏఐ మేధస్సు అభివృద్ధి చెందుతున్నంత మాత్రానా మానవ మేధస్సు మసకబారిపోకూడదు. ఇదంతా మనం ఏఐ ఎలా ఉపయోగిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. మనకు AI మద్దతు అవసరమైతే, మనం దానిని తీసుకోవచ్చు కానీ ఏఐ మీదనే మొత్తం బాధ్యత వదిలేయకూడదు కదా!మనం బలమైన నిర్ణయాలు తీసుకోవాలనుకుంటే, మన ఆలోచనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. మనిషి గొప్పతనం ఆలోచించే, విశ్లేషించే, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంలోనే ఉంటుంది. దానిని సజీవంగా ఉండాలంటే మనం ఆలోచించడం మర్చిపోకుండా, మన మెదడును కూడా అప్పుడప్పుడు వాడుతూ ఉండాలి.కాగా, కొద్ది రోజుల క్రితం చాట్ జీపీటీ సీఈవో శామ్ ఆల్టమన్ కూడా ఇదే విషయం మీద చర్చించారు. AI విషయంలో జర జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. AI విషయంలో ఏదీ రహస్యం కాదని, చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు, న్యాయస్థానాలు అడిగితే ఏఊ వద్ద ఉన్న వినియోగదారులు మొత్తం సమాచారాన్ని అందించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.అలాగే, ఏఐ తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ అది ఇచ్చే సమాచారం పై అతి విశ్వాసం మంచిదికాదన్నారు. ఏఐ మోడల్స్ కొన్ని యూజర్ల అవసరాలు తీర్చేందుకు కొన్నిసార్లు వాస్తవాలతో రాజీపడి కల్పిత సమాచారాన్ని సృష్టిస్తుంటా యని తెలిపారు.ఎవరేమన్నామన జీవన పరిణామ క్రమంలో మార్పు అనేది అనివార్యమైనది. దానిని ఎవ్వరూ అడ్డుకోలేరు, ఆపలేరు. చివరకు ఆ మార్పుకి నాంది పలికిన వారు కూడా. ఏ ఐ మీద ఆధారపడడం మనమే కాస్త తగ్గించుకుం టూ ఉంటే భవిష్యత్తులో మన మెదళు నిరుపయోగమైపోకుండా ఉంటాయన్నమాట.

# చంద్రబాబు, ఆంధ్రా .. పాపం బీఆర్ఎస్ !

హైదరాబాద్,అప్పట్లో ఘట్టో.. ఇప్పుడు ముషారఫ్ అని సమాధానాలు చేతిమీద రాసుకొచ్చి ప్రజల ముందు అప్పచెప్పినట్లుగా భారత రాష్ట్ర సమితి చేస్తున్న రాజకీయాలు ఉంటున్నాయి. ఉద్యమ కాలం నుంచి నాటి చెబుతున్న చంద్రబాబు, ఆంధ్రా కబుర్లు .. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా చెబుతున్నారు. తమకు అధికారం కోల్పోయిన తర్వాత.. తమ పార్టీ పేరుతో తెలంగాణ అనే పేరు ఎత్తేసిన తర్వాత కూడా చెబుతున్నారు. దీని వల్ల ప్రజల్లో ఎమైనా స్పందన ఉందా లేదా అన్న ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారో లేదో స్పష్టత లేదు. కానీ వారు మాత్రం తాము అనుకున్నదారిలోనే వెళ్తున్నారు.

తెలంగాణ పేరు తీసేసి.. జై తెలంగాణ అనడం వైఫల్య రాజకీయం

తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు తీసేసి.. భారత రాష్ట్ర సమితి అని పేరు పెట్టి ఏపీలోనూ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నారు. బీఆర్ఎస్ ఏపీ చీఫ్ ను నియమించారు. అంటే.. సెంటిమెంట్ రాజకీయాలకు కాలం చెల్లిందన్న అభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. మరి ఇప్పుడు అదే సెంటిమెంట్ రాజకీయాలను నమ్ముకుని రాజకీయాలు చేయడం తిరోగమనమే. కానీ దాన్ని బీఆర్ఎస్ నేతలు అర్థం చేసుకోలేకపోతున్నారు. రాష్ట్ర విభజనకు ముదురు చంద్రబాబు, ఆంధ్రా అంటే ప్రజలు ఉద్రేకపడ్డారేమో కానీ విభజన జరిగి పదేళ్ల పాటు లేని రాజకీయం.. మళ్లీ బీఆర్ఎస్‌కు అధికారం పోవడంతోనే మళ్లీ ప్రారంభం కావడం ప్రజల్ని కూడా ఆశ్చర్య పరుస్తుంది. బీఆర్ఎస్ నేతలకు ఇంత అమాయకంగా కనిపిస్తున్నామా అని వారు కూడా విస్మయానికి గురవుతున్నారు.

చంద్రబాబు, ఆంధ్రా బూచిలు ఔట్ డేటెడ్

భారత రాష్ట్ర సమితితమ ఉనికే తెలంగాణకు మేలు అని ప్రచారం చేయాలనుకుంటున్నారు. తామే తెలంగాణ ప్రయోజనాలను కాపాడతామంటున్నారు. అలాంటి పరిస్థితి రావాలంటే.. ఎవరో తెలంగాణను దోచుకుంటున్నారని చెప్పాలనుకుంటున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత.. ఎవరు ఎవర్ని దోచుకుం




టారు?. దిగువన సముద్రంలోకి వెళ్లే నీళ్లను ఏపీ మళ్లించుకుంటే మన నీళ్లు దోపిడీ చేస్తున్నారని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేయడం %ా%బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల పనులు ఆంధ్రా కాంట్రాక్టర్లు చేసినా ఇప్పుడు మాత్రమే.. గోల చేయడం.. ఇవన్నీ రాజకీయం అనుకుంటున్నారు. కానీ ప్రజల్లో మీరు చేసిందేమిటి అన్న ప్రశ్న వస్తుందని అనుకోవడం లేదు.

సోషల్ మీడియా పెయిడ్ ఆర్టిస్టులే బలమనుకుంటున్నారా ?

భారత రాష్ట్ర సమితి పూర్తిగా పతనావస్థలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు.. పార్లమెంట్ ఎన్నికల నాటికి పునాదులు కదిలిపోయాయి. ఇప్పుడు ఇంకా ఘోరంగా ఉంటుంది. సోషల్ మీడియాపై చాలా ఖర్చు పెట్టేసి.. ఎక్కువ మందితో పోస్టులు పెట్టించేస్తే పార్టీ బలంగా ఉన్నట్లుగా అవదు. ఏ వర్గాన్నీ దగ్గర చేసుకోకుండా అహంకారంతో అందర్నీ దూరం చేసుకుని.. తమను గెలిపించకపోతే తెలంగాణకు అన్యాయం చేసినట్లే అన్న డైలాగులు కొడితే%ా%ఓటర్లు పడిపోతారా?. బీఆర్ఎస్ ఎప్పుడు నేర్చుకుంటుంది?.


# ఎస్ఎస్ రాజమౌళి డైలాగులు ఎందుకు?..



అమరావతి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కౌంటర్ ఇచ్చారు. 'చావు దగ్గరకు వస్తే ఒక చేయి మీసం మెలేస్తా' అనే డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి డైలాగులు ఎందుకు?అని విమర్శించారు. ధైర్యవంతుడు, పెద్ద డైలాగ్స్ కొట్టే సతీష్ రెడ్డి వేల్పుల ఘటనలో ఎందుకు దాక్కున్నావు? అని ప్రశ్నించారు. వేల్పుల కాల్పుల ఘటనలో గన్‌మెన్ ఫైర్ చేశారా, లేక నువ్వే గన్ లాక్కుని ఫైర్ చేశావా సమాధానం చెప్పాలి? అని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడుతో చెప్పి వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో సతీష్ రెడ్డికి ప్రమేయం లేదని చంద్రబాబు నాయుడికి చెప్పి కేసులో లేకుండా చేశాం అని బీటెక్ రవి గుర్తుచేశారు. బీటెక్ రవి, సతీష్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగుతున్న విషయం తెలిసిందే.'సతీష్ రెడ్డి, నేను 20 ఏళ్లకు పైగా ఒకే పార్టీలో పనిచేశాం. ఆయనపై మాట్లాడటానికి సంశయించి ఈ ప్రెస్ మీట్ పెట్టాం. మేము కాదు మొరిగేది, నారా లోకేష్ అనే ఏనుగును చూసి వైసీపీ వారు మొరుగుతున్నారు. దొంగల సామెత కూడా సతీష్ రెడ్డికి తెలియదు. మేము ఆయన దగ్గరకు వెళ్లలేదు. పార్టీని వీడే రోజు ఏర్పాటు చేసిన విందుకు చాలా మంది రాలేదు. ఆరోజు టీడీపీలో అన్యాయం జరిగిందని కేడర్‌కు చెప్పినా.. వారు టీడీపీలోనే ఎందుకు ఉన్నారు. సతీష్ రెడ్డి స్వార్థం కోసం పార్టీ మారాడు. రామలింగా రెడ్డి హత్య కేసు ప్రస్తావించారు. మాది ఫ్యాక్షన్ ఫ్యామిలీ అని ఎన్నో సందర్భాల్లో చెప్పా. రాజారెడ్డి హత్య కేసులో సతీష్ రెడ్డి ముద్దాయి. ఆ విషయాన్ని ఒప్పుకుంటారా?. పదవి కోసం హత్య చేశారని మాట్లాడటం విడ్డూరం. ఎంపీపీ పదవి కోసం గొడవ జరిగితే వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి చనిపోలేదా?. నువ్వు చేస్తే సంసారం.. మేము చేస్తే ఇంకోటా?' అని బీటెక్ రవి ఎద్దేవా చేశారు.'వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో సతీష్ రెడ్డికి ప్రమేయం లేదని చంద్రబాబుతో చెప్పి కేసు లేకుండా చేశాం. వేంపల్లిలో సొంత పోలింగ్ బూతులో కనీసం ప్రభావం చూపలేదు. అలాంటి వ్యక్తిని నారా లోకేష్ పట్టించుకోవాల్సిన అవసరం లేదు. లోకేష్ బాబును ఇష్టానుసారంగా మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటే భౌతిక దాడి చేస్తామని కాదు. వేంపల్లి నాలుగు రోడ్లలో మంచం వేసుకుని పడుకో.. నీకు మేము భద్రత కల్పిస్తాం. సతీష్ రెడ్డికి ముప్పు ఉన్నది వైసీపీ నేతలతో.. మాతో కాదు. వేల్పుల కాల్పుల ఘటనలో కూడా సతీష్ రెడ్డిని చంద్రబాబు కాపాడారు. ఇదే విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పాడు. చావు దగ్గరకు వస్తే ఒక చేయి మీసం మెలేస్తా అనే రాజమౌళి డైలాగులు ఎందుకు. మరి అలాంటి సతీష్ రెడ్డి వేల్పుల ఘటనలో ఎందుకు దాక్కున్నాడో. ఏడు ఎన్నికలు పులివెందులలో సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఆ ఎన్నికల్లో రిగ్గింగ్ జరగకుండా మెజారిటీ వచ్చిందని చెప్పగలరా?. వేల్పుల కాల్పుల ఘటనలో గన్‌మెన్ ఫైర్ చేశారా.. లేక నువ్వే గన్ లాక్కుని ఫైర్ చేశావా సమాధానం చెప్పాలి. ఈ రెండిటికి సమాధానం చెబితే తరువాత మేం మాట్లాడతాం' అని బీటెక్ రవి పేర్కొన్నారు.

# ఉచితంగా ఇస్తే ప్రజలకు వాటి విలువ తెలీదు!

ముంబై, ప్రజలకు ఉచితంగా ఇస్తే వాటి విలువ తెలియదని.. విద్య, శిక్షణ వంటి వాటికి ఫీజులు తీసుకోవడం అవసరమని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ పేర్కొన్నారు. అన్నీ ఉచితంగా కావాలని ప్రజలు కోరుకుంటారని, కానీ ఉచితంగా ఏమీ ఇవ్వకూడదని, ప్రభుత్వ పథకాలు, సేవలలో ఉచితాల సంస్కృతిని ప్రోత్సహించడం వల్ల వాటి విలువ తగ్గుతుందన్నారు.స్వయం సమృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయం ఒక వ్యసనం లాంటిదని, ఆ వ్యసనంలో కూరుకుపోయినప్పుడు మనిషి ఆలోచనా శక్తిని కోల్పోతాడని అన్నారు. అధికారం, సంపద, అందం- ఇవన్నీ శాశ్వతం కావు, క్షణికమైనవని అన్నారు. మంచి రోజుల్లో పొగిడేవారు ఎకువ మంది ఉంటారని, కానీ కష్టకాలంలో పలకరించేవారు కూడా ఉండరని పేర్కొన్నారు.



# కవిత సీఎం అయితే, మరి కేసీఆర్ ఏం కావాలి?



హైదరాబాద్,ఇటీవల జాగృతి మీటింగ్ లో ఎమ్మెల్సీ కవిత స్టేజ్ పైకి వచ్చే సమయంలో కొంతమంది సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. కవిత వారిని వారించినట్టు కనపడలేదు. ఆ నినాదాలు విని ఆమె బాగా సంతోషించారు. ఆ తర్వాత నిదానంగా ఏయ్ అల్లరి చేయకండి అంటూ సర్దిచెప్పారు. ఆరోజు జాగృతి తరపున బయటకు వచ్చిన వీడియోల్లో ఈ సన్నివేశం లేదు. కాస్త ఆలస్యంగా ఈ వీడియో బయటకు రాగా ఇప్పుడిది వైరల్ అవుతోంది.

కవిత సీఎం అయితే కేసీఆర్..

సీఎం సీఎం అంటూ నినాదాలు చేస్తుంటే వినడానికి బాగానే ఉంటుంది కానీ, సమయం సందర్భం లేకుండా జాగృతి మీటింగ్ లో కవిత వచ్చేటప్పుడు సీఎం సీఎం అనే నినాదాలు ఏంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పోనీ కవితే సీఎం అభ్యర్థి అనుకుంటే, మరి కేసీఆర్ ఏంకావాలని మరికొంతమంది లాజిక్ తీస్తున్నారు. అటు కేటీఆర్ ఏమో.. కేసీఆరే మన నెక్ట్ సీఎం అంటున్నారు. ఇంతకీ ఆ ఫ్యామిలీలో ఎంతమంది సీఎం అభ్యర్థులు ఉంటారు. అసలు బీఆర్ఎస్ పార్టీ ఫ్యూచర్ ఏంటో తెలియదు కానీ, సీఎం సీటుకి అప్పుడే పోటీ మొదలైందంటూ కౌంటర్లు పడుతున్నాయి. ముందు ఇంటి రాజకీయాలు చక్కబెట్టుకోవాలంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు.

ఫ్యామిలీ పాలిటిక్స్..

పరిస్థితులు అనుకూలిస్తే రెండో దఫా అధికారం ముగిసేలోపు కేసీఆర్, కేటీఆర్ ని సీఎం చేస్తారని అనుకున్నారంతా. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే కేటీఆరే సీఎం అనే ప్రచారం జరిగింది. కానీ బీఆర్ఎస్ ఆ ఎన్నికల్లో బొక్కబోర్లా పడింది, ఆ తర్వాత ఎంపీ ఎన్నికల్లో సున్నా సీట్లతో మరింత దారుణ పరాభవం మూటగట్టుకుంది. ఆ తర్వాత కేటీఆర్ కి జ్ఞానోదయం అయింది. కేసీఆరే మన నెక్ట్ సీఎం అంటూ ఆయన పదే పదే చెప్పడానికి కారణం అదే. కేసీఆర్ ముందు వరుసలో ఉంటేనే బీఆర్ఎస్ కి కాస్తో కూస్తో ప్రజాదరణ ఉంటుంది, ఆయన్ని వెనక్కి నెట్టి కేటీఆర్ ముందుకొస్తే అంతే సంగతులు. హరీష్ వర్గం అప్పుడే పక్కకు వెళ్తుంది, మిగతా నాయకులు కూడా తలోదారి చూసుకుంటారు. అందుకే కేటీఆర్ తండ్రి పేరుని వాడుకోవాలని చూస్తున్నారు. కానీ ఆయనకు చెల్లెలి రూపంలో శత్రువు తయారైంది. కవిత రాజకీయం, కేటీఆర్ ని మరింత అభద్రతా భావంలోకి నెట్టేస్తోంది.మన నాయకుడు కేసీఆర్, మన బాస్ కేసీఆర్ అంటూ కవిత కూడా గతంలో పదే పదే ప్రస్తావించేవారు. అయితే ఇప్పుడామె రూటు మార్చినట్టు తెలుస్తోంది. సీఎం సీఎం అంటూ తనని పొగిడేస్తున్న అభిమానులను ఆమె ఎందుకు వారించలేదు? మనం అధికారంలోకి వస్తే సీఎం అయ్యేది కేసీఆరేనని ఆమె ఎందుకు చెప్పడం లేదు? అంటే కవిత మనసులో ఏదో ఉంది. బీఆర్ఎస్ కి ప్రత్యామ్నాయంగానే ఆమె జాగృతిని తెరపైకి తెస్తున్నారు. జాగృతి రాజకీయాలతో బీఆర్ఎస్ కి కానీ కేసీఆర్ ఫ్యామిలీకి కానీ సంబంధాలు లేవని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే సీఎం సీఎం అనే నినాదాలను ఆమె ఆస్వాదించారు. కవిత రాజకీయం ఎలా ఉన్నా.. కేసీఆర్ కుటుంబం మాత్రం ప్రజల్లో మరింత పలుచన అవుతోందని అంటున్నారు నెటిజన్లు.

# మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని కలిసిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ మంత్రిగారి దృష్టికి ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కొరకు నిధులను కేటాయించాలని, యూనివర్సిటీ లో ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలని మంత్రి గారికి విజ్ఞప్తి చేశామన్నారు.అంతేకాకుండా పిజి,ఇంజనీరింగ్, ఎంబిబిఎస్,డిగ్రీ,ఇంటర్, పార్మసీ,పాలిటెక్నిక్ మరియు ఇతర కోర్సులలో అడ్మిషన్లు మొదలైన సందర్భంగా విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయం మరియు ఇతర సర్టిఫికెట్ లను సకాలంలో అందేలాగా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలు ప్రజల ఆదరణ పొందినాయి అన్నారు, అధికారంలోకి వచ్చిన పద్దెనిమిది నెలలోనే ఆరు గ్యారెంటీలను నూటికి తొంభై శాతం అమలు చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రజల సంక్షేమమే దెయ్యంగా కాగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రైజింగ్ తెలంగాణ దిశగా ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు రమేష్,రాజేందర్, శివాజీ, శ్రీను, చరణ్,అరుణ్, శ్యామ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు

ఏలూరు,రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాల న్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేశారు.కైకలూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణ సమస్యలపై స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్ సమీక్ష నిర్వహించారు. కైకలూరు సియన్ ఆర్ గార్డెన్స్ లో సోమవారం నియోజక వర్గంలో ఇళ్ళ నిర్మాణాలు,ఇళ్ల పట్టాలు,ఇతర సమస్యలపై రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి,రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా అధికారులతో సమీక్ష సమావేశం పాల్గొన్నారు.నియోజక వర్గంలో మండలాలు వారీగా ఇళ్ల నిర్మాణాలు,ఇళ్ల స్థలపట్టాలు,ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కైకలూరు గ్రీన్ విలేజ్,కలిదిండి, మండవల్లి మండలాల్లోని లే అవుట్లలో సమస్యలపై సమీక్ష నిర్వహించారు.తొలుత కైకలూరు గ్రీన్ విలేజీని సందర్శించి అక్కడ అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్థంగా ఉన్న ప్రధాన రహదారుల తోపాటు- అంతర్గత రహదారుల సమస్యను, తాగునీటి సమస్యను,విద్యుత్తు వంటి మౌలిక సమస్యలను స్వయంగా పరిశీలించానని అన్నారు.గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో 15 లక్షలు 30 లక్షలు పక్కా గృహాలు నిర్మిస్తున్నామని ఆర్భాటపు ప్రచారాలు చేసి చివరకు లబ్దిదారులను నిండా ముంచేసిందని ఆరోపించారు. ఒక ప్రణాళిక లేకుండా ఒక విజన్ లేకుండా గృహనిర్మాణ పథకం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఫలితంగా లబ్దిదారులు తీవ్రంగా నష్ట పోయారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన మిగిలిన ప్రతి పేదవానికి అర్బన్లో 2 సెంట్లు-, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు- చొప్పున నివేశనా స్థలాలు మంజూరు చేసి రూ.2.50 లక్షలు చొప్పున మంజూరు చేస్తుందని తెలిపారు. అదనంగా బీసీలకు,ఎస్సీలకు రూ 50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ 75 వేలు నుంచి రూ 1 లక్ష చొప్పున అదనంగా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారన్నారని తెలిపారు.స్వంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్దిదారులకు రూ.1 లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. -కై-కలూరు గ్రీన్ విలేజ్లో అసంపూర్తిగా నిలిచి పోయిన ఇళ్లను త్వరితగ`తిన క్రొత్త కాంట్రాక్టరుతో నిర్మాణాలు పూర్తి చేస్తామని,అందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ విలేజ్లో రోడ్లు,విద్యుత్తు,తాగునీరు వంటి ప్రధాన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మంత్రి సారథి స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో గృహ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగిందని, దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు కూడా ఖచ్చితంగా తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం,అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే దమ్ము ఒక కూటమి నాయకులకే ఉందని స్పష్టం చేశారు.ఎందుకంటే సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే నని పేర్కొన్నారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లో కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు.అలాగే ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా




# అదానీకి షాక్..! ఆ ప్లాంట్లు రద్దు చేసిన ఏపీ సర్కార్..



అమరావతి,అదానీ గ్రూప్‌కు కేటాయింపులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం.. అదానీ గ్రూప్ కు ఇచ్చిన పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది..ఆంధ్రా – ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో అదాని గ్రూప్‌నకు పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు ఇచ్చింది గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. అయితే, గిరిజనులకు దక్కాల్సిన ప్లాంట్లు అదానీ గ్రూప్ కు ఇవ్వడంతో వెనక్కు తీసుకుంది కూటమి సర్కార్.. మరోవైపు, తమ ప్రాంతానికి చెందిన గిరిజనులతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం.. అయినా, గత ప్రభుత్వం అదానీ గ్రూప్ కు పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లను ఇవ్వగా.. వాటిని ఇప్పుడు రద్దు చేసింది కూటమి ప్రభుత్వం..కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అదానీ గ్రూప్ యొక్క పెదకోట పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ను 1,000 నుండి 1,800 మెగావాట్లకు విస్తరించడానికి మరియు అనకాపల్లి జిల్లాలో రైవాడ PSP ని 600 నుండి 900 మెగావాట్లకు విస్తరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆమోదం పర్యావరణవేత్తల నుండి విమర్శలు వచ్చాయి.. జనవరి 2023లో సర్వే కోసం పెదకోట మరియు ఇతర గ్రామాలను సందర్శించిన సర్వే బృందాన్ని గిరిజనులు అడ్డుకున్నారు.. మరోవైపు, సామాజిక కార్యకర్త మరియు భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి E.A.S. శర్మ ఏపీ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు రాసిన లేఖలో, PESA చట్టం (పంచాయతీల షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ చట్టం, 1996) మరియు అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి స్థానిక గిరిజన ప్రజలను సంప్రదించకుండా ప్రాజెక్టు అనుమతులు ఏకపక్షంగా ఇవ్వబడ్డాయని ఆరోపించారు.. అదానీ గ్రూప్‌కు ఇచ్చిన ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచడానికి అనుమతించడమే కాకుండా, స్థానిక ప్రవాహం నుండి నీటిని జల ప్రాజెక్టు కోసం ఉపయోగించుకోవడానికి కూడా అనుమతి ఇచ్చారని మండిపడ్డారు.. గిరిజన ప్రజలకు ప్రత్యేక హక్కులను ఇచ్చే రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ కింద పెదకోట ప్రాంతాన్ని నోటిఫై చేశారని శర్మ పేర్కొన్నారు. మొత్తంగా ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అదానీకి ఇచ్చిన పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది..

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**